క్లుప్తంగా

'హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి'

గంపలగూడెం: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు వద్ద సహకార సంఘాల ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది విరామ సమయంలో బుధవారం తమ నిరసన వ్యక్తం చేశారు. సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 2019 తర్వాత నియామకం పొందిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు, మేనేజర్ సుగ్గల కనకదుర్గ, అసిస్టెంట్ మేనేజర్ ఎం.మంగలక్ష్మి, సూపర్‌వైజర్ ఏసోబు, సీఈఓలు నరసింహారావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మునునూరు: చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.కిరణ్ కుమార్ సూచించారు. స్థానిక బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. 70 మంది విద్యార్థులను పరీక్షించిన ఆయన చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మంచి పరిసరాలను కల్పించి, పౌష్టికాహారంతో విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని వార్డెన్‌కు సూచించారు.

దోమల నిర్మూలనకు చర్యలు



మునునూరు: డెంగీ వ్యాధిని అంతమొందించాలంటే అందరం దోమల నిర్మూలనకు కృషి చేయాలని నూజివీడు సబ్ యూనిట్ వైద్యాధికారి ఎం.యలమంద పిలుపునిచ్చారు. డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా బుధవారం రమణక్కపేట పీహెచ్‌సీలో వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్ ఆధ్వర్యంలో డెంగీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు దోమ తెరలు వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

నేడు సురక్ష క్యాంపులు

ఊటుకూరు/దుందిరాలపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలంలోని రెండు గ్రామాలలో గురువారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. దుందిరాలపాడు, ఊటుకూరు-2 సచివాలయాలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: కొత్తగూడెంసచివాలయంలో గురువారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలోని తాతకుంట్ల గ్రామ సచివాలయం వద్ద గురువారం ఉదయం 9.30 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. వివిధ సర్టిఫికెట్ల కోసం వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి ధ్రువీకరణపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

'జగనన్న తోడు'తో చిరు వ్యాపారులకు లబ్ధి



'జగనన్న తోడు' సాయంతో లబ్ధిదారు నడుపుతున్న పండ్ల దుకాణం

- తిరువూరు నియోజకవర్గంలో లబ్ధి పొందినవారు – 1,883
- నాలుగేళ్లలో అందిన మొత్తం – రూ.8 కోట్లు

తిరువూరు: ''దుకాణాల్లో రేయింబవళ్లు పనిచేస్తే మాకు వచ్చే జీతం రూ.5 వేలకు మించి లేదు. కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్న వ్యాపారాలు చేసుకోడానికి ప్రోత్సాహాన్ని అందించడంతో పళ్ల దుకాణం నడుపుకుంటున్నాం. నాలుగేళ్లుగా జగనన్న తోడు పథకం కింద ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. బ్యాంకు ద్వారా కూడా రుణం పొందే అవకాశం కల్పించారు. ఇప్పుడు మా కాళ్లమీద మేము నిలబడగలిగాం'' అని తిరువూరుకు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు చెబుతున్నారు. ఇదేవిధంగా తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, తిరువూరు నగర పంచాయతీలో కలిపి మొత్తం 1,883 మందికి జగనన్న తోడు పథకం కింద లబ్ధి చేకూరుతోంది. పండ్ల దుకాణాలు, టీ స్టాల్స్, బడ్డీ దుకాణాలు, పండ్ల రసాల అమ్మకం, కిరాణా షాపులు, మినీ సూపర్‌బజార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయం ఎంతో ఉపయోగపడుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు.

తిరువూరు నియోజకవర్గంలో 2023లో జగనన్న తోడు లబ్ధిదారుల వివరాలు		
మండలం	లబ్ధిదారుల సంఖ్య	మంజూరైన సొమ్ము
తిరువూరు టౌన్	387	రూ.38,70,000
తిరువూరురూరల్	260	రూ.26,00,000
గంపలగూడెం	516	రూ.51,60,000
విస్సన్నపేట	472	రూ.47,20,000
ఏకొండూరు	248	రూ.24,80,000
మొత్తం	1,883	రూ.1,88,30,000

రూ.8 కోట్ల మేర లబ్ధి

గత నాలుగు సంవత్సరాల్లో తిరువూరు నియోజకవర్గంలో జగనన్న తోడు పథకం కింద లబ్ధిదారులకు రూ.8 కోట్ల మేర ఆర్థిక సాయాన్ని అందజేశారు. చిరు వర్తకులకు చేయూత నందించడంలో ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటోంది.

కుటుంబాన్ని పోషించుకుంటున్నాం



గతంలో కూలిపనులకు వెళ్లి చాలీచాలని ఆదాయంతో ఇబ్బంది పడే వాళ్లం. ఇప్పుడు జగనన్న తోడులో ఆర్థికసాయం అందించడంతో పండ్ల దుకాణం నడుపుకుంటూ సంతృప్తికరమైన ఆదాయం పొందుతున్నాం. మా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. గత నాలుగేళ్లలో మాకు రూ.40వేల ఆర్థికసాయం ప్రభుత్వం అందించింది.

– మేకల రమణ, చీమలపాడు, ఏకొండూరు మండలం

చిరువ్యాపారులకు మేలు



సొంత పెట్టుబడి లేక వ్యాపారం చేయాలని ఉన్నా వెనుకంజ వేసే మా వంటి చిన్న వ్యాపారులకు జగనన్న తోడు ఎంతో మంచి పథకం. ప్రభుత్వం వారు ఇచ్చే రూ.10వేల ఆర్థిక సాయానికి తోడు వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేందుకు బ్యాంకు నుంచి కూడా రుణాలు ఇప్పిస్తున్నారు. సజావుగా తిరిగి చెల్లిస్తే మళ్లీ రెట్టింపు రుణం కూడా బ్యాంకు నుంచి ఇస్తున్నారు.

– షేక్ బాజీ, చీమలపాడు, ఏకొండూరు మండలం

అర్హులందరికీ ఆర్థిక సాయం

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన వారిని గుర్తించి జగనన్న తోడు పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు సిఫార్సు చేశాం. గత నాలుగు సంవత్సరాలుగా లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయించి వారి ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేవారికి మరింత ప్రయోజనాలు పొందే అవకాశం కూడా ఉంది.

– గురవయ్య, వెలుగు ఏపీఎం, తిరువూరు

గంగానమ్మ ఆలయంలో హుండీ చోరీ

ఇబ్రహీంపట్నం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని గంగానమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కోయ వెంకటసుబ్బారావు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. రెండుగేట్లకు తాళం వేసినా దుండగులు హుండీ, అమ్మవారి మెడలో హారం, ముక్కుపుడకను దోచుకెళ్లారు. తెల్లవారు జామున గ్రామానికి చెందిన భక్తుడు కనగాల కోటేశ్వరరావు పూజ కోసం ఆలయానికి రాగా తాళాలు తీసి ఉండడంతోపాటు హుండీ లేకపోవడం గమనించి కమిటీ సభ్యులకు ఫోన్ చేసి తెలిపారు. హుండీలో నగదుతో పాటు బంగారం కలిపి సుమారు రూ.3.50 లక్షలు వరకు ఉంటాయని కమిటీ చైర్మన్ తెలిపారు. క్లూస్ టీమ్ సభ్యులు పరిసరాల్లో ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



గంగానమ్మ ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

గిరిజన విద్యార్థికి ఆర్థిక సాయం

మైలవరం: పేద గిరిజన విద్యార్థికి మైలవరం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, కోశాధికారులు రూ.15 వేలను బుధవారం సాయంగా అందజేశారు. ఏ.కొండూరు మండలం గ్యామా తండాకు చెందిన జరబల శ్రీనివాస్ నాయక్ భార్య గతంలో మృతి చెందింది. ఇతను పేద అయినా కుమార్తెను హోమియో మెడిసిన్ చదివిస్తున్నాడు. కుమారుడు జరబల గోవింద నాయక్‌కు కాన్పూర్ ఐఐటీలో సీటు వచ్చింది. కుమార్తెకు రూ.1,50,000, కుమారునికి రూ.లక్ష కావాల్సి ఉండగా స్థానిక బ్యాంక్ అధికారులు కొంత ఆర్థిక సాయం చేస్తామన్నారు. అయినా ఇంకా రూ.లక్ష కావాల్సి ఉంది. ఈ క్రమంలో మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ కోశాధికారి కమిటీ సభ్యులతో చర్చించి కొంత సాయం చేస్తామని పేర్కొన్నారు.

'జగనన్న సురక్ష'లో సమస్యల పరిష్కారం



నూజివీడు మండలం పోలసానపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



గోపవరంలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు



చాట్రాయి మండలం పోలవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న బాబ్జీ

నూజివీడు: మండలంలోని పోలసానపల్లిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామస్తులకు 485 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ పీఏ విజయ్‌కుమార్, డీటీ జీ వెంకటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి మండలంలో..

మండలంలోని ఈదులగూడెంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. గ్రామస్తులకు 1,137 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ పీ శంకర్‌రావు పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: రాజకీయాలతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ స్పష్టం పేర్కొన్నారు. మండలంలోని పోలవరం సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం 360 మందికి ఉచితంగా ధ్రువపత్రాలు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, ఎంపీడీఓ దుర్గాప్రసాదు, తహసీల్దార్ విశ్వనాథరావు పాల్గొన్నారు.

మునునూరులో..

మునునూరు: ప్రజలందరి సంక్షేమమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని వైస్ ఎంపీపీ పాముల గంగాధరరావు పేర్కొన్నారు. తహసీల్దార్ సుధ అధ్యక్షతన గోపవరంలోని సచివాలయం-2 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 857 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల వాణి, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకూ ప్రాధాన్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణతో ప్రజలు కోరుతున్న అవసరాలను గుర్తించి నిధులు కేటాయిస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. తిరువూరు ఒకటో వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరువూరు పట్టణంలోని అన్ని వార్డులలో సీసీ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, నగర పంచాయతీకి ప్రత్యేక నిధుల కేటాయింపుతో డ్రెయిన్లు, తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులను కలిసి వారి స్పందనను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, కొలికపోగు నిర్మల, తంగిరాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీ కళాశాల నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

మైలవరం(రెడ్డిగూడెం): ప్రభుత్వ కళాశాలకు దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రవాసాంధ్రులు, కళాశాల భవన నిర్మాణ దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి వితరణ రూ.13 లక్షలతో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, కార్యాలయంలో అత్యాధునిక మోడల్ కంప్యూటర్లు, ప్రింటర్స్, టేబుల్స్, చైర్స్ అందజేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ హనిమిరెడ్డి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

సాగుపైర్లపై అవగాహన పెంచుకోవాలి



పత్తిపైరులో క్షేత్రప్రదర్శన నిర్వహిస్తున్న సత్యవతి

గంపలగూడెం: రైతులు తాము సాగు చేసే పైర్లపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.సత్యవతి తెలిపారు. గంపలగూడెం రైతు భరోసా కేంద్రంలో తొలకరి పంటలపై రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన నేల లక్షణాలు, ఉండాల్సిన ఆర్గానిక్, కార్బన్ శాతం, సేంద్రియ, జీవన ఎరువుల వాడకం వల్ల ప్రయోజనాలను ఆమె వివరించారు. గంపలగూడెంలోని పత్తి పైరులో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్ కోట పుల్లమ్మ పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ ఉషారాణి

పెనమలూరు: కానూరులో అదృశ్యమైన బాలుడిని పోలీసులు వెంటనే ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కానూరుకు చెందిన ఎం.నాని వ్యవసాయ కూలీ. అతనికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు థామస్ (7) కానూరు ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. మంగళవారం నాని తన కుమారుడు థామస్‌ను పాఠశాలలో దించి పనులకు వెళ్లాడు. అయితే సాయంత్రం నాని భార్య కుమారుడి కోసం పాఠశాలకు వెళ్లగా అక్కడ థామస్ కనిపించలేదు. గ్రామంలో విస్తృతంగా గాలించినా చిన్నారి ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలుడి ఫొటో వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి గాలింపు చేపట్టారు. అయితే బాలుడు సైకిల్ తొక్కుకుంటూ మంగళవారం రాత్రి పోరంకి శివారు ప్రాంతం సాలిపేట పొలాల వద్ద కనపడడంతో స్థానికులు అతనిని తమ వద్దే జాగ్రత్తగా ఉంచి, బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి సీఐ కిషోర్ బాబు తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్, ఆంధ్ర హాస్పిటల్ సహకారంతో స్థానిక లయన్స్‌క్లబ్ మల్టీ సర్వీస్ హాల్లో గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ జాన్‌బాబు బుధవారం తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఐదు వేలు విలువగల వివిధ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ టీమ్ పరిశీలన

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛ సర్వేక్షన్ టీమ్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో పబ్లిక్ ప్రాంతాల్లో, స్కూల్స్, దేవాయాల వద్ద పరిశుభ్రతను తనిఖీ చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, కామన్ లెట్రిన్స్ వినియోగం శుభ్రతలను గమనించారు. గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ సర్వేక్షన్ టీమ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి చెన్నకేశవరావు వారికి వివరాలు తెలిపారు.

ప్రణాళికతో విద్యనభ్యసిస్తే విజయం తథ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు, వేదికపై తేజోవతి, జగదీష్, శ్రీధర్, రోజేష్‌బాబు, నాగేశ్వర శర్మ

విజయవాడ కల్చరల్: విద్యార్థులు ప్రణాళిక, సంకల్పం, పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమని యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అంశంగా అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్య సాధనే ధ్యేయంగా చిత్తశుద్ధి, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. అధ్యాపకులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు తేజోవతి, జగదీష్‌లు మాట్లాడుతూ.. ధృఢమైన మనస్సు, మంచి స్నేహితులు, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అవగాహన సదస్సులో కళాశాల కరస్పాండెంట్ ఎస్ఎస్ వరప్రసాద్, ఇంటర్మీడియెట్ విభాగం ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్టెల రోజేష్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు నిపుణులు పరిష్కారాలు చెప్పారు.

దాసాంజనేయ ఆలయ హుండీ ఆదాయం రూ.12.11 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.12 లక్షల 11 వేల 729 నగదు, 75 యూఎస్ డాలర్ల ఆదాయం లభించింది. మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో లెక్కింపులో పాల్గొన్నారు. 112 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఇన్‌స్పెక్టర్ అనురాధ తెలిపారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు బండి నాగజ్యోతి, కోలా సురాంబ, యక్కల మారుతి, ప్రత్యేక ఆహ్వానితులు పోలుకొండ శ్రీనివాసరావు, భక్తులు సేవ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన మోకా రాజ్‌కుమార్ బోరు పనులు చేస్తాడు. అతను మంగళవారం పనికి వెళ్లలేదు. రాత్రి పెనమలూరు సెంటర్‌లో మద్యం దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలవటంతో అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.